శ్రీ మెతుకు మనోహర్ రెడ్డి

# నెత్తుటి రెండు రంగులు

అది ప్రాతఃకాలం. ఇంకా సూర్యుడుదయించలేదు. చార్‌మినార్ క్రాసురోడ్డులో ఒక స్త్రీ దీనావస్థలో జిడ్డుముఖంతో తారట్లాడుతున్నది. పేళ్లుపడ్డ నెత్తి, ముద్దలుగా అతుక్కుపోయిన వెంటుకలు, ఆమె దారిద్ర్యాన్ని చెప్పక చెప్పుతున్నాయి. మైలబట్టి పేలికలయిన గుడ్డలు, ఏ రంగువో గుర్తించ వీలులేకున్నవి. అవి అర్ధ శరీరాన్నయినా దాచలేకున్నవి. ఆమె ఒక ఎముకలగూడ. ప్రాణమున్నది కావున ఆశవున్నది. ఆశ వున్నది కావున బ్రతుకుతున్నది. ఆ బ్రతుక్కు ఒక్క పైస విలువ కూడ లేదు. అసిటిక్ ఆసిడ్ ప్లాంట్, చార్‌మినార్ సిగరెట్టు ఫ్యాక్టరీ పోటీగా ముక్కు పుటాలను పగులగొట్టేస్తున్నవి. ఆమె ఒక నల్లటి కుక్క, కూనలా ఉన్న మాంసపు ముద్దను మోస్తున్నది. ఆ స్త్రీ ఎంకి, ఆ మాంసపు ముద్ద ఎంకి మూడేళ్ళ కొడుకు నర్సిములు. వానికి తలమీద వెంట్రుకలు లేవు. ఎంకి ఎండిన రొమ్ములనే పాలకోసం చీకుతాడు. వానికి ఆకలి తీరుతుందో లేదో కాని వాడుమాత్రం అలాచేస్తూనే, ఏడుస్తుంటాడు.

సంగం టాకీసు మూలమీద చెప్పులు కుట్టే రాజయ్య పక్కన రోజూ ఉదయమే ఇదేవేళన కూర్చుంటుంది. అఫ్జల్‌గంజ్ నుండి సికింద్రాబాద్‌వైపు పోయే బస్‌స్టాప్‌లో, సిండికేట్ బ్యాంకు ముందు ఆఫీసుకు పనులకు పోయేవాళ్ళను చెయ్యెత్తి భిక్షమెత్తడంతో ప్రారంభమవుతుంది ఎంకి దినచర్య. జనిగలా ఎంకి రొమ్ములను దినమంతా దాని చంకలో కూర్చొని పీలుస్తూనే ఉంటాడు. వాని నెత్తిమీద కోపం వచ్చినప్పుడల్లా ఎంకి వేస్తూనే ఉంటుంది. "అయ్యా దానం చేయండి. బాబులూ దానం చేయండి. మీకు దేవుడు పదింతల సుఖమిస్తాడు" అని ప్రాధేయపూర్వకంగా పాట పాడినట్లు లయబద్ధంగా గొంతెత్తి అరుస్తుంది. రోజూ మ్యున్సిపల్ స్వీపర్ రామయ్య విసుక్కుంటూ ఎంకిని దీవిస్తూంటాడు. "ముండా! ఇప్పుడే తెల్లారిందా! ఏం మొఖమే పక్కకు జరుగు, నేనూడ్చుకోవాల" అంటాడు. ఎంకి భయపడక అంతకన్నా ఘాటుగా తిడ్తుంది. రామయ్య "కదులుత్తావా? లేక చీపురుదెబ్బలు కావాల్నా" అని అరుస్తాడు. తిట్టుకుంటూ పక్కకు జరుగుతుంది ఎంకి. రామయ్య ఊడ్చుకుంటూ వెళ్ళిపోతాడు.

అదే సమయంలో E C. I. L., I. D. P. L మరియు H. A. L. ఫ్యాక్టరీలకు పోయే బస్సులు వచ్చి అక్కడ ఆగుతవి. ఆ సాబులు, దొరసానుల దగ్గిఱ ఎంకికి ఉదయాన్నే 50 పైసల్దాకా దొరుకుతవి. ఇందిరాపార్క్ ప్రక్కనుండి వచ్చే రోడ్డునుండి ఆకుకూరలు అమ్మే ముసలమ్మలు నెత్తిన గంపలు పెట్టుకొని చిక్కడపల్లికిపోతారు. 8 గంటలకు చార్‌మినార్ సిగరెట్టు ఫ్యాక్టరీ విడుస్తారు. ఆర్టీసి వర్క్‌షాప్‌కు వాళ్ళ బస్సులు నిండు చూలాల్లా మనుష్యుల్ని మోసుకొస్తయి అదేటయిమ్‌లో. రోడ్డంతా గందరగోళంగా ఉంటుంది. వాహనాల రుసరుసలు, సైకిళ్ల, రిక్షాల కదలికలతో రోడ్డంతా గజిబిజిగా ఉంటుంది.

ఆ రోజు సోమవారం. ముషీరాబాద్ టెలిఫోన్ ఎక్చేంజ్‌లో లేడీ ఆపరేటర్ రేమండ్ సూటింగ్ అబ్బాయితో బాతాఖాని వేస్తున్నది. సమయం ఉదయం 9 గంటలు సికింద్రాబాద్ స్టేషన్‌కుపోయే 2 నం. బస్ ఆగింది. ఫ్లడ్‌గేట్లు తెరిస్తే నీరు ఎలా వస్తుందో అలానే మనుషులు బయటకు వస్తున్నారు బస్సునుండి. మాంసపు ముక్కకోసం కాట్లాడే కుక్కల్లా బస్సులోకి చొరబడుతున్నారు. పాను షాప్‌నుండి రేడియోపాట అప్పుడే విడుదలయిన సినిమాలోనిది వినపడుతున్నది. కార్నర్‌లోనున్న ప్రెసిడెంట్ హోటల్‌లో తందూరి చికెన్, పులావ్‌లో ఘుమఘుమలు నోరూరిస్తున్నవి. ఆవల క్రిస్టల్ బార్ దీనికి పోటీ పడుతున్నది. ఎంకి వీటన్నిటిలో తనను తాను మరిచింది. ఒకేసారి పరలోకంనుండి ఊడిపడ్డదానిలా "దానం చేయండి అమ్మల్లారా! తిండిలేక రెండు రోజులయింది" అంటూ లయబద్ధంగా అరవసాగింది. ఇంతలో 50 పైసల నాణెం ఆమె గిన్నెలో పడింది. దాత సుదర్శన్ థియేటర్ ఓనర్ బిడ్డ. రోజూ ఇదే త్రోవన సెంట్‌ఫ్రాన్సిసు కాలేజ్‌కు పోతుంది. కారు ఆపి ఇష్టమొచ్చినప్పుడల్లా ఎంకికి దానం చేస్తుంది. ఎంకి మనసారా ఆ అమ్మాయిని దీవిస్తుంది, మంచి మొగుడు దొరకాలని, ముద్దొచ్చే బిడ్డలనివ్వాలని, రెండు చేతులెత్తి ఆకాశంవంక చూచి దేవుణ్ని ప్రార్థిస్తుంది ఎంకి. ఆ పూబోణికి ఇది సంతోషంగా ఉంటుంది. ఇంతలోనే చాలామంది బిచ్చగాళ్ళు వచ్చి ప్రక్కన చేరారు. ఎంకి వేరే దగ్గిఱ అదృష్టం చూసుకోవాలని ఆలోచించింది. అడిక్‌మేట్‌నుండి ఇక్కడకు వచ్చి అడుక్కొనే పోచమ్మ అంటే ఎంకికి మంట. పోచమ్మకు ఎంకికి ఎప్పటికి పోట్లాటనే. తాబేలులా నడిచే పోచమ్మ ముసలిది. చార్‌మినార్ క్రాస్‌రోడ్ పోచమ్మ మొగుడుదయినట్లు ఇతర బిచ్చగాళ్ళమీద కేకలేస్తుంది. ఎంకి రోడ్డుదాటి సంధ్య థియేటర్ వైపు పోవాలనుకున్నది. 91 నంబర్ బస్సు వచ్చి ఆగింది. కండక్టర్ "కవాడిగూడ, బోట్స్ క్లబ్, ఆర్. పి. రోడ్, మారేడ్‌పల్లి" అని అరుస్తున్నాడు రోడ్డు దాటి వేడి వేడి జిలేబీలుచేసే బండిదగ్గిఱ చేయిచాపింది. అంతకుముందే ఇంకా బోణీయయినా కాక వాడు గజ్జి కుక్కను తరిమాడు. కోపంతోవాడు రెండు జిలేబీలు ఎంకిమీద విసిరాడు. ఒకటినర్సిములుకు ఇచ్చింది ఎంకి. వాడు దాన్ని ఒకేసారి

మింగి మళ్ళీ చేయి చాపాడు. ఎంకి ఇవ్వలేదు. నర్సిగాడు ''లంజా! అన్నీ నువ్వే తింటావే!'' అంటూ చంకలోనుండే అరచాడు. లాభం లేదనుకొని ఎంకి గబుక్కున జిలేబిని మింగేసింది, మళ్ళీ తనకు దొరుకుతుందో లేదోనని. కనుగ్రుడ్లు ఎంకివి బయటకు పొడుచు కొచ్చినవి. ''లంజాకొడుకా! నేను తినద్దారా!'' అని వాని వీపుమీద చరిచింది. ఎంకిమెల్లగా దాని కుంటిమొగుడు రంగని దగ్గరకు పోయింది. వాడు సుదర్శన్ థియేటర్ముందు బిచ్చమెత్తుకుంటాడు.

రంగనికి దయనీయమైన గత చరిత్ర ఉన్నది. వాడు పూర్వం రాజేంద్ర ఆయిల్ మిల్‌లో వర్కర్. ఉన్నంతలో వాడు బాగానే బ్రతికేవాడు. వాళ్ళు రోజుకు రెండుసార్లు వంట చేసికొనేవాళ్ళు. పాత దుస్తులు కొనుక్కొని కాలం గడిపేవాళ్ళు. ఒక గుడిసె ఉండేది అడిక్‌మెట్‌లో. వానికి వారానికి 36 రూపాయల జీతం. ఏడేళ్ళ కొడుకు ఉండేవాడు. ఒకరోజు ఫ్యాక్టరీ ప్రమాదంలో చిక్కుకుని కాలు విరిగింది. రక్తం మడుగులోనుండి వాడ్ని తీసికొని తోటి వాళ్ళు ఉస్మానియా ఆస్పత్రిలో చేర్చారు. జీవన్మరణ సంధిలో మూడు నెలలు గడిపినాక ఒక కాలుని తీసివేసి ఇంటికి పంపారు. ఇంకో మూడు నెలలు రాజేంద్ర ఆయిల్ మిల్లుచుట్టూ తిరుగుతే 500 రూ.లు ఇచ్చారు. అప్పటినుండే వాళ్ళ జీవిత నాటక రంగంలో శోకపు అంకం మొదలయింది. వాళ్ళ గుడిసెలో దొంగతనం జరిగింది. ఆ దొంగలు ఇంకా బీదవాళ్ళు. లేకుంటే ఈ దేశపు బీదరికానికి అట్టడుగు చరిత్రకు వాళ్ళు తార్కాణాన్ని ఈ విధంగా ఎందుకు చూపెడుతారు? ఏడేళ్ళ కొడుకు టి. బి.తో చనిపోయాడు. కొన్ని నెలల్దాక వాళ్ళను వాళ్ళు భిక్షమెత్తుకొని పోషించుకొనేవాళ్ళు. కాని విధి ఓ విపరీతం చేసింది. నర్సిగాని రూపంలో వాళ్ళు ఓ జనిగను కన్నారు. ఎంకి రక్తాన్ని వాడు పీలుస్తుంటే దాని ప్రాణం పైపైనే పోయేది. గుడిసెను అమ్ముకొని వీధుల పాలయ్యారు వాళ్ళు.

రంగడు వాని స్థానంలో వాడు కూర్చున్నాడు. వాని ప్రక్కన మంగలివాళ్ళు, చెప్పులుకుట్టేవాళ్ళు కూర్చుంటారు. మంగలి దానయ్య అంటాడు ''ఈ రంగడు బస్సు క్రిందపడి ఎప్పుడో చస్తాడు'' అని. ఎంకి వచ్చే సరికి రంగడు ఒక కాగితంలో పెట్టుకొని ఏదో తింటు న్నాడు. ఎంకి ఇది చూచి ''కుంటిముండాకొడుకా! నిన్నటినుండి నర్సిగానికి నాల్గు మెతుకులన్నా లేవు. నీవు పంది తీరుగ తింటా వురా! కొద్దిగా నర్సిగానికి పెట్టురా!'' అని కేకవేసింది. నర్సిగాడు ఎంకి చంకలోంచి దిగి కాగితాన్ని లాక్కోబోయాడు. రంగడు ఒక్క బుక్కలో మింగి కాగితాన్ని విసిరివేశాడు. వీళ్ళ నాటకాన్ని చూస్తున్న గజ్జికుక్క ఆ కాగితాన్నందుకుని పరుగుతీసింది. నర్సిగాడు కుక్క వెంబడి ఉరికాడు. కాని టెలీఫోన్ కేబుల్ జాయింట్ ఇండికేటర్‌కు తట్టుకొని బోర్లాపడ్డాడు. మోకాళ్ళు గీరుకొని రక్తం కారగా కోపంతో వాడు వాపసువచ్చి వాని అయ్యను ''బోసిడికే! నాకీయక అంతా తిన్నావు కదరా!'' అని రంగని జుట్టుపట్టుకొని లాగాడు. ఎంకి ఇదంతా మౌనంగా పరిశీలిస్తున్నది. దాని మొగుడిది ఇంకో కాలును విరిచేయాలనుకున్నది. నర్సిగాడ్ని చంపి, తనను చంపుకోవాలనుకున్నది. దానికండ్లు ఈనిన పులికండ్లలాగ ఉన్నవి. నర్సిగాడ్ని ఒకటి చరచి బరాబరా లాక్కొనిపోయింది.

రంగడు అక్కడే కూర్చొని ''కుంటోన్ని బాబూ! దానం చేయండిబాబూ! మీ పిల్లలు చల్లగుంటారు'' అని లయబద్ధంగా దీర్ఘాలు తీస్తున్నాడు. చెప్పులుకుట్టే రామయ్య వీని కఠోర కంఠ శోషను సహించలేక ''సాలా! గాడిదలాగా ఓండ్ర పెడ్తవ్! పో!బే!! ఇక్కడనుంచి'' అని అరిచాడు. రంగడు పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యునిలాగా ''నీ అయ్య జాగానారా! ఇది సర్కార్ జాగారా! నీవైతే ఇక్కడ సెప్పులు కుట్టి నాల్గు పైసలు జేసికుంటవు! నేనేమోకూసో వద్దారా!'' అని ఘాండ్రించాడు. చెప్పులు కుట్టించుకొనే ఆసామి సుప్రీమ్‌కోర్టు జడ్జిలాగా ఇద్దరికి తీర్పు చెప్పాడు ''మీరిద్దరు పేదవాళ్ళే! మీలో మీరెందుకు పోట్లాడుతారు! ఇద్దరూ ఓర్చుకోవాలి'' అన్నాడు. రంగనికి ఆరోజు బాగలేదు. దేక్కుంటూ వేరే దగ్గఱకు పోదామనుకున్నాడు. వాడు ప్రెసిడెంట్ హోటల్‌వైపు పోయాడు. అక్కడ ఎంకి హోటల్ లోపలికి పోయి చేయిచాపింది. ఒకతను ఒక బన్ను ముక్కను విసిరాడు. ఇంకో ఆయన సమోసాను ఇచ్చాడు. ఒకాయన చాయ్‌ను గిన్నెలో పోశాడు. అట్లాపోసి మేనేజర్ మీద కేకలు వేశాడు ''ఇది హోటలా! లేక కబూతర్ ఖానానా!'' అని. మేనేజర్ ఎంకిపై వేడి వేడి చాయ్ చల్లాడు. చురుక్కుమన గానే నర్సిగాడ్ని వదిలేసి భూమిమీద పొర్లింది. హోటల్లో తింటున్న బాబులందరు ఈ హంగామాను చూచి నవ్వారు. ఎవ్వరూ ఆమెను పాపం అనలేదు. పోలీసు కానిస్టేబుల్ రావ్ ప్యారే పాన్ తింటూ రోడ్డులో పోయే జవ్వనిని తనివితీరా చూస్తున్నాడు. హోటల్ మేనేజర్ ''దొంగముండా! నీవు టేబుల్లమీదినుండి సమోసాలు ఎత్తుక పోతున్నావే! నిన్ను పోలీసులకు అప్పజెప్తా!'' అన్నాడు. ఎంకి ''నేను దొంగతనం చేయలేదు. బాంచను'' అంటూ లేచింది. చిరిగిన కొంగు దాని ఎండిపోయిన రొమ్ములను చాటు చేయలేకపోతున్నది. రంగడు ఇంతలోనే చేరుకొని ''పిచ్చిముండా! నీ విక్కడ ఎందుకడుక్కున్నావే! దిక్కులేనోల్లు అడుగుపెట్టే జాగా కాదే'' అంటూ కన్నీళ్ళు పెట్టుకొన్నాడు. అందరూ కలిసి నూనె షాప్‌లోకి పోయి కొంచెం నూనె అడుక్కొని కాలిన గాయాలకు రుద్దుకొని ఎంకి చేతగాక కూర్చొన్నది. అక్కడే పడివున్న సగం కుళ్ళిన జాంపండును నర్సిగానికి ఇచ్చింది. వాడు పరమ సంతోషంతో దాన్ని తిన్నాడు. మధ్యాహ్నం రెండుగంటలయింది. సంగం, సంధ్య, సుదర్శన్‌లలో మార్నింగ్ షోలు విడిచారు. జనమే జనం. ఈ సదవకాశాన్ని వాళ్ళు వినియోగించుకున్నారు లయబద్ధంగా వాళ్ళు బిచ్చమెత్తుకోవడానికి ఉపయోగించే పదజాలానికి ముగ్ధులయినా, కాకపోయినా ప్రజలు వాళ్ళకి మొత్తం 76 పైసలు ఇచ్చారు. వాళ్ళు చిక్కడపల్లి కూరగాయల మార్కెటుకుపోయి రెండు వంకాయలు, ఓ టొమాట, ఓ ఆలుగడ్డ, ఉల్లిగడ్డలు మూడు సంపాయించారు. వాళ్ళ సంతోషానికి అవధులులేవు. సాయంత్రం చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంముందు వాళ్ళ డ్యూటీ! అక్కడికి కాలేజ్ కుర్రాళ్ళు, ఆడవాళ్ళు, మగవాళ్ళు వస్తారు.

ఆరోజు శనివారం కావడంమూలాన రంగనికి ఎంకికి కలిసి రూపాయి న్నర వచ్చాయి. రంగడు వంట చేద్దామా ! అన్నాడు. ఎంకి మండి పడి నా కాళ్ళు పొయ్యిలో పెట్టి వండాల్నా! అంది. చెత్తకుండీల్లో కాయితాలు, గుడ్డలు జమచేశారు. కట్టెపుల్లలు కొన్ని చేర్చారు. రూపాయితో నూకలు కొనుక్కొన్నారు. 8 గంటల రాత్రికి చిక్కడ పల్లి బ్రిడ్జిమీదికి చేరుకున్నారు. మట్టికంచుడులో వంట ప్రారంభ మయింది. రంగనికి, నర్సిగానికి స్వర్గమంటే ఇదేనేమో అనిపిం చింది. వాళ్ళ ముందునుండి మొన్ననే ఫిలిప్స్‌వాళ్ళు వేసిన నియాన్ లైట్ల వెలుగుల్లో పెట్రోలు దండుగచేస్తూ కార్లు రొద చేస్తు న్నవి. ఎలక్షన్ల టైమ్ అది. ఎక్కడపడితే, అక్కడ పోస్టర్లు, ఝండాలు మరి లౌడ్ స్పీకర్ల గోలలు. ముప్పయి సంవత్సరాల పాలనలో ఎందరు క్రొత్తగా రంగనివంటి సమాజంలో చేరారో కాని బారు సోషలిజాలు, బీరు ఉపన్యాసాలు రాజకీయ నాయకులు ఇస్తూనే ఉన్నారు. ప్రజలు సంతృప్తి పడ్తూనే ఉన్నారు. రంగడు కలలలోనే కడుపునిండా తింటాడు. నిద్రించడానికి మున్సిపల్ స్థలం, తినడానికి అడుక్కున్న తిండి, త్రాగడానికి సర్కార్ పంపునీళ్ళు. రంగడ్ని ఏ తరగతిలో విభజించాలి.

వంట అయింది. ముగ్గురూ మూడు భాగాలు చేసికొని అమృతం అనే అనుభూతితో తింటున్నారు. నర్సిగాడు ఎంకని చిప్పలో చేయిపెట్టి రెండుసార్లు తీసికొన్నాడు నూకల అన్నం. నర్సి గాడు సంతోషంతో ''ఈ రాత్రికి బువ్వ దొరికింది. రోజా దొరికితే బాగుండు''అన్నాడు. వాని అయ్యవైపు చూచి ''ఈ సాలెగాడు నాకు పెట్టనే పెట్టడు'' అన్నాడు.

ఎంకి ''ఎవన్ని సాలా అంటున్నవ్.''

నర్సిగాడు ''ఇంకా ఎవన్ని, ఈ కుంటోన్నే!''

''తప్పురా, వాడు నీ నాయన!''

''ఈ కుంటోడు నా నాయన్నా?''

రంగనికి ఎవరో ఛాతిలో బాకుతో పొడిచినట్లయింది. ఎంకిని, నర్సిగాడ్ని పీక పిసికి చంపేయాలన్న కోపం వచ్చింది. తర్వాత వాడ్ని వాడే చంపుకోవాలనుకున్నాడు పురుగులకన్నా హీనంగా బ్రతికే వాళ్ళ జీవితాలు మనదేశ చరిత్రకు ఏమన్నా తెలుసా !

ఈ మహానగరంలో డబ్బుకోసం, పొట్టకూటికోసం శరీరా లను అమ్ముకునే వాళ్ళున్నారు. అరగంట ఆనందాన్నిచ్చే వాళ్ళ జీవి తాలు ఎంత హేయమయినవి. హైసొసైటీ లేడీసు వెరైటీకోసం, రుచులకోసం మరిగితే, బీదా బిక్కీ జానెడు పొట్టకోసంగడ్డి తింటు న్నారు. రంగనికి గుడిసెలో గుడ్డిదీపం వెలుగులో వ్యాపారం చేసే లచ్చి జ్ఞాపకం వచ్చింది. ఎంకితో ఏదో ఏదో సంగతి ఎత్తి లచ్చి గురించి పొగిడాడు. ఎంకికి కోపం ఆగలేదు. రంగని గొంతుని రెండు చేతులా పిసుకుతూ ''నీకు శోకులారా ! కుంటోడా! ఇంకోసారి ఆ లంజ ముచ్చట ఎత్తితివా! తలకాయ పలగ్గొడుతా!'' అని ఒక్క కుదుపు కుదిపింది. రంగడు ఎన్నో ఒట్లు పెట్టుకొన్నాడు మళ్ళో సారి దాని ఊసు ఎత్తనని.

ఈమధ్య హైద్రాబాద్ ఫౌండ్రీ వాళ్ళు పారబోసిన బూడిద నుండి చిన్న చిన్న బొగ్గులేరి అమ్ముకొంటున్నది ఎంకి. దర్వానుకు రోజుకు 25 పైసలు కానుక ఇస్తున్నది ఎంకి. రోజుకు మూడు రూపాయల్దాకా సంపాయిస్తున్నది. ఒకవిధంగా మున్సిపాల్టీ వాళ్లని మెచ్చుకోవాలి, ఎన్నో రంగని సంసారాలవంటి వాటికి వండుకోడానికి జాగా, పబ్లిక్ పంపులో నీళ్ళు, రాత్రికి వీధిలో వెలుతురు ఉచితంగా ఇస్తున్నందుకు. నిజంగా రోలింగ్ ప్లాను, పంచవర్ష ప్రణాళిక ఈవిధంగా ఉపయోగపడుతున్నందుకు మేధావులను అభినందించాలి. రంగడుమాత్రం బిచ్చమెత్తుకొంటూనే ఉన్నాడు. అందరు కలిసి రోజుకు 5 రూపాయలదాకా సంపాదిస్తున్నారు. నర్సిగాడ్ని స్కూల్లో వేయాలని, వాడ్ని బాగా చదివించాలని రంగడు, ఎంకి అనుకున్నారు. ఫుట్‌పాత్ జీవితాలు గడుపుతూ వాళ్ళు స్కూల్‌కు పంపాలను కోవడం భ్రమేనేమో. శీతాకాలపు రాత్రులు, వేసవి కాలపు మిట్ట మధ్యాహ్నాలు ఫుట్‌పాతులమీద గడపాలి వాళ్ళు. నర్సిగాడు ఎదుగు తున్నాడు. వాడు వారానికోసారి తలకు నూనె రుద్దుకుంటున్నాడు. ప్రతి రాత్రికి చిక్కడపల్లి బ్రిడ్జిమీద వంట చేసికుంటున్నారు. వాళ్ళు ఒకరిపై ఒకరు ప్రేమగా ఉంటున్నారు. నర్సిగాడు అడు క్కొనివచ్చే పిండి, నూకలు, బియ్యం అన్నీ కలిపి వండుతుంది ఎంకి. వాళ్ళ చిప్పల్లో గంజిలాంటి ఆ వంటకాన్ని పోసి తాను తృప్తిగా తాగుతుంది. ఈ కుటుంబపు ఆశలు చిగురిస్తున్నవి. వాళ్ళ జీవితాల వసంతాలు, ఝంఝూమారుతాలు అన్నీ ఆ పేవ్‌మెంట్లమీదనే.

ఆ రోజు సాయంత్రం, చిక్కడపల్లి బ్రిడ్జీమీద విశ్రాంతి తీసికుంటున్నారు రంగడు, ఎంకి, నర్సిగాడు. రోడ్డుకు అవల బెంగాళీ బాబులా ఉన్న ఒకతను కారు రిపేర్ చేసికుంటున్నాడు. అతన్ని డబ్బులడుక్కోవాలని నర్సిగాడు రోడ్డు దాటాడు. ఆయన 50 పైసల నాణాన్ని వాడికిచ్చాడు. దానితో వాడు చుడువా కొను క్కోవాలని మిఠాయి బండార్‌కు వెళ్ళాడు. అంతకుముందే రంగడు మున్సిపల్ డస్టుబిన్‌లో చచ్చి పడివున్న కాకిని తెచ్చాడు. ఎంకి దాన్ని వండడానికి ఉపక్రమిస్తున్నది. ఆ రోజు వాళ్ళకు విందు భోజనము.

ఇంతలో ఎక్కడినుండో ఓ గుంపు అలజడిచేస్తూ వచ్చింది. దుకాణాలకు నిప్పు అంటించింది. అంతా అలజడి, కేకలు. బస్సులన్నీ ఆగిపోయాయి. పోలీసు వ్యాను వచ్చింది. గుంపును చెదరగొట్టడానికి లాఠీచార్జ్ చేసింది. గుంపు రాళ్ళు రువ్వారు. పోలీసులు ఫైరింగ్ చేశారు. ప్రజలు చెల్లాచెదరయ్యారు. ఎంకి, రంగడు వణుకు తున్నారు. తుఫాను తర్వాత ప్రశాంతంలా ఉన్నది. అగ్నిమాపక దళం కాలుతున్న దుకాణాలను ఆర్పుతున్నారు. నర్సిగాని శరీరం నెత్తుటి మడుగులో పడివున్నది. వాని చేతిలో చుడువాపొట్లం విచ్చి పోయి, చుడువా భూమ్మీద పడిపోయింది. ఎంకి లబో దిబోమంటూ వాని భౌతిక కాయాన్ని మోసుకొని వచ్చింది పేవ్‌మెంటుమీదికి. వాడుసగం కోసిన మేకలా వున్నాడు. ఎంకి, రంగని ఆవేదనకు

అంతంలేదు. వాళ్ళకు ఆ భౌతికకాయాన్ని స్మశానం తీసికపోవాలన్నా బిచ్చమెత్తుకోవాలి. వాళ్ళు బ్రతుకుకోసం బిచ్చమెత్తుకుంటారు, చావుకోసం బిచ్చమెత్తుకుంటారు.

తెల్లవారి అన్ని పత్రికలలో తాటికాయంత అక్షరాలలో వార్త ప్రచురించబడింది- "మతకలహాల నణచడానికి పోలీసులు భాష్పవాయు ప్రయోగం చేశారు అది విఫలంకాగా రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. ఇద్దరు దుండగులు మరణించారు, ఐదుగురు గాయపడ్డారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా రాజధాని నగరంలో 48 గంటల కర్ఫ్యూ."

చనిపోయినవారిలో నర్సిగాడు, ఇంకో బిచ్చగాడు ఉన్నారు. వాళ్ళ శవాలైనా పారేయకుండా కర్ఫ్యూ. వాళ్ళందరు ఎక్కడ వుంటారు? వాళ్ళు ఎక్కడ తింటారు? ఇదంతా ఎవరు ఆలో చిస్తారు. వాళ్ళ నెత్తురు రంగు నల్లన. మిగిలినవాళ్ళ నెత్తురు ఎర్రన.

---

# సుప్తోస్మి జాగృతే

అమ్మాయిరాలో అస్థిపంజరాలు అంత
రంగంలో అగ్ని
పర్వతాలు ఎన్ని
చోట్ల తిరిగి
నా వదలని నీడ
మలుపు
ల్లో చిరునవ్వులు నీ
రెండ తళుకుల్లో స్మృతి
పరాగాలు ఆశ
యాల అల
యాలకు అశ్రు సో
పానాలు నిరంతర
యానాలు అపార్థాలకు అన
ర్థాల ఉపపత్తుల కొలిమి
తిత్తులు క్షమా
పణల దివా
లాలు బ్రతుకు కాగి
తంపై తెగిన గాలిపటం దా
రంలా తెగిన
ఊహ మనం చెయ్య
బడింది కలలు చెయ్య
బడిన పదార్థాలతో
రణాలతో రణాలతో !

# ప్రార్థన

దూర తీరాల కదలాడే శాంతి భ్రాంతి
చేరువ కాకున్నా
చిత్తాన్ని స్పృశించకున్నా
ఏదో ఉండనివ్వు ఆశే అయినా దురాశే అయినా
నిరాశకన్నా మేలు ...

పర్వతాలకన్నా బరువైన ఒంటరితనం
దీన్ని మీటి పారెయ్యటం ఎవరితరం
నిరంతరం ఆరాటం ...

ప్రభూ ! ప్రార్థన తెలియని పాపుల్ని
కటాక్షించు
ఎలాంటివైనా ఏ రసాలవైనా ఏవో కొన్ని
మరచిపోకుండా మాకు మా రోజువారీ
కలల్ని ప్రసాదించు God !
Give us our daily dreams ... !

కేఎస్వీ